అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్‌ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జెడ్పీ చైర్మన్‌ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్‌: యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్‌ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ప్రతాపసింగారంలో జెడ్పీ పాఠశాల అదనపు గదులు, డ్రైనేజీ పనులు, ఫంక్షన్‌ హాలులో వంట గదుల పనులను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమార్‌, మాజీ సర్పంచ్‌ వేణుగోపాల్‌, రాజేశ్‌, కుమార్‌, సందీప్‌రెడ్డి, హెచ్‌ ఎం రవి, నరసింహ, ప్రభాకర్‌, అబేదా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కీసర : పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌ శ్రీనివాస్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్‌ కమిషనర్‌ రాజమల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్‌లో కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్‌ సిబ్బందిని పర్మినెంట్‌ చేయాలని, వారికి నూతన పీఆర్సీలో భాగంగా రూ.26 వేల జీతం చెల్లించాలన్నారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పబ్లిక్‌, నాన్‌పబ్లిక్‌ కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్ని కృష్ణ, మున్సిపల్‌ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్‌ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మేడ్చల్‌ : గౌడవెల్లి గ్రామంలో నిర్మిస్తున్న రైల్వే అండర్‌పాస్‌ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయించాలని కాంగ్రెస్‌ నాయకులు సౌత్‌ సెంట్రల్‌ రైల్వే డివిజన్‌ ఇంజినీర్‌ జగదీష్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పనులు ఆలస్యంగా జరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌ ముదిరాజ్‌, రవి, గోపాల్‌, భగవాన్‌దాస్‌, వినోద్‌గౌడ్‌, గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

బంగారం వ్యాపారికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌

మేడ్చల్‌ : మేడ్చల్‌లో దొంగల దాడిలో గాయపడ్డ జ్యువెలరీ షాపు యజమాని శేషారాం చౌదరిని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌, గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ శుక్రవారం వేరు వేరుగా పరామర్శించారు. మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో పరామర్శించి ఘటన వివరాలను తెలుసుకున్నారు. నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

24న క్రీడా పాఠశాలకు ఎంపికలు

శామీర్‌పేట్‌ : రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు జరుగుతున్నాయని ఎంఈఓ వసంత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 24న శామీర్‌పేటలోని మినీ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 4వ తరగతి ప్రవేశానికి 1-09-2015 నుంచి 31-08-2016 తేదీలోగా జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు తదితర సర్టిఫికెట్‌లతో పాటు 3వ తరగతి ప్రోగ్రెస్‌ రిపోర్ట్‌, 5 పాస్‌ ఫొటోలతో జూన్‌ 24న ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9502456329, 9182133856, 9704816313 నంబర్లకు సంప్రదించాలన్నారు.

అవస్థల్లో అంగన్‌వాడీలు

జీతాలు అందక.. అద్దెలు రాక ఇబ్బందులు

- జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దె భవనాల్లో 443
- 117 కేంద్రాల్లో నీటి కొరత, మరుగుదొడ్లు లేనివి 118
- సమస్యల పరిష్కారానికి చొరవ చూపని అధికారులు



793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది

212 కేంద్రాలకే సొంత భవనాలు

సాక్షి, మేడ్చల్‌ జిల్లా : సమస్యలతో అంగన్‌వాడీ కేంద్రాలు తల్లడిల్లుతున్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె డబ్బులు చెల్లించకపోవటం ఒక వంతు అయితే.. సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరైన వసతులు కల్పించలేని పరిస్థితి దాపురించింది.

జీతాలు అందకపోవడంతో..

అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల(హెల్పర్లు)కు కూడా నెలనెలా జీతాలు అందడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పసి పిల్లలు, గర్భిణులు, బాలింతలు పలు సమస్యలు ఎదుర్కోక తప్పటం లేదు. పలు కేంద్రాల్లో కనీస అవసరాలైన తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌ సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత శాఖ అధికారులకు ఇవన్ని తెలిసినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అద్దె భవనాలకు ఏడు నెలలుగా అద్దె చెల్లించకపోవటంతో టీచర్లు, ఆయాలు ఇంటి యజమానుల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం ఒకటి, రెండు రోజుల్లో సెప్టెంబర్‌ నుంచి మార్చి వరకు అద్దెలు రానున్నట్లు పేర్కొంటున్నారు.

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఆరు నెలల నుంచి ఆరేండ్ల పిల్లలు 90, 361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్‌ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాల్లో 47.028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లోని 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39, 463 మంది, అల్వాల్‌ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20, 993 మంది ఉన్నారు.

సమస్యలతో సతమతం

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. మేడ్చల్‌ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్‌ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్‌ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో ఓనర్లు టాయ్‌లెట్‌ కట్టించి ఇచ్చే పరిస్థితి లేదు.

జిల్లాలో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్‌ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలకు 277 కేంద్రాలు, అల్వాల్‌లో 271 కేంద్రాలకు 143 కేంద్రాలు, మేడ్చల్‌లో 211 కేంద్రాలకు 23 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

ఖాళీ పోస్టుల వివరాలు

42 టీచర్‌ పోస్టులు, 38 ఆయా పోస్టులు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న 751 మంది టీచర్లు, 741 మంది ఆయాల(హెల్పర్లు)కు ఏప్రిల్‌, మే నెలల జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో డబ్బులు లేక తమ పిల్లలను స్కూళ్లు, కాలేజీలకు పంపించలేని పరిస్థితి ఎదుర్కొంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ : యువకుడి మృతి



మృతి చెందిన శ్రవణ్‌కుమార్‌

మేడిపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీనివాస్‌నగర్‌ కాలనీ బోడుప్పల్‌కు చెందిన శ్రవణ్‌కుమార్‌ (23)తన ద్విచక్ర వాహనంపై తన పని నిమిత్తం ఉప్పల్‌ నుంచి మేడిపల్లి వైపు వస్తుండగా, అదే సమయంలో రాంగ్‌ రూట్‌లో అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న శ్రవన్‌ కుమార్‌ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో శ్రవణ్‌కుమార్‌ తన బైక్‌పై నుంచి ఎగిరి కిందపడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

జయశంకర్‌కు ఘన నివాళి



మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో నివాళులర్పిస్తున్న నేతలు



కాచవానిసింగారంలో విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

మేడ్చల్‌ : ప్రొఫెసర్‌ జయశంకర్‌ వర్ధంతి సందర్భంగా నాయకులు, అధికారులు, పార్టీల నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలేసి స్మరించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, నాయకులు సురేందర్‌, రమణారెడ్డి, దయానంద్‌, గోపాల్‌, భాస్కర్‌, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌ : కాచవానిసింగారంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై మాజీ సర్పంచ్‌ వెంకట్‌రెడ్డితో కలిసి జయశంకర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పవన్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్‌, స్నేహం, శంకర్‌, దినేశ్‌, వెంకటేశ్‌గౌడ్‌, మహేశ్‌, పవన్‌, వంశీ పాల్గొన్నారు.

హిందువుల జోలికొస్తే ఊరుకోం

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మేడ్చల్‌రూరల్‌ : హిందూ దేవాలయాలు, హిందువుల జోలికొస్తే ఊరుకునేది లేదని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ అన్నారు. మేడ్చల్‌ మండలంలోని డబిల్‌పూర్‌ గ్రామంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు సీతారాముల విగ్రహాలను ధ్వంసం చేసిన ఆలయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఘటనపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బక్రీద్‌ మరుసటి రోజు విగ్రహాల ధ్వంసం విచారకరమన్నారు. నిందితులను పోలీసులు వెంటనే పట్టుకోవాలని కోరారు. విగ్రహాల ధ్వంసంపై ఆందోళన చేసిన గ్రామస్తులపై అక్రమ కేసులు పెడతామని పోలీసులు బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. హిందువుల ఆలయంలో దాడులకు పాల్పడితే ప్రొటెక్ట్‌ చేయొద్దా? అని రాష్ట్ర సీఎం, డీజీపీలను ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌ పక్కనే ఉన్న జ్యువెలరీ షాపులో దొంగతనం జరగడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని ఆయన అన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా దోహదం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథ్‌స్వామి, ఎంపీ ఈటల రాజేందర్‌
- జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



కలెక్టరేట్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

సాక్షి, మేడ్చల్‌ జిల్లా: ఆరోగ్య శ్రేయస్సుకు యోగా అభ్యాసాన్ని పెంపొందించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ టి రఘునాథ్‌ స్వామి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన మట్లాడారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు యోగా ఒక మార్గమన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌ అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ రామ్‌ మోహన్‌, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్‌ సంధ్యారాణి, డాక్టర్‌ సరస్వతి, డాక్టర్‌ గీతా ప్రసాద్‌, మంజుల రాజేశ్వర్‌ రెడ్డి, డాక్టర్లు జంగయ్య, రాజ్యలక్ష్మి, భానురేఖ, విజయరాణి, అనూషారాణి, వైద్య, ఆరోగ్య శాఖ సూపర్‌ వైజర్లు పాల్గొన్నారు.

పతంజలి ఆధ్వర్యంలో..

మేడ్చల్‌ : ఆరోగ్య పరిరక్షణకు యోగా దోహదపడుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండల పరిషత్‌ కార్యాలయంలో పతంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డేలో ఆయన పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, నాయకులు నందారెడ్డి, శైలజ హరినాథ్‌, పతంజలి సమితి సభ్యులు పాల్గొన్నారు.

కీసరలో..

కీసర : యోగా చేయడం వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్యకరంగా జీవించగలుగుతారని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన యోగాలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్‌ స్కూల్‌, నాగారంసెరినిటీ స్కూల్‌లో చిన్నారులతో యోగా కార్యక్రమాలను నిర్వహించారు. కీసరలో బండారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.

కీసర: జూబ్లిహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ రాంపల్లిలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ పద్మజరావ్‌ యోగాభ్యాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సంస్కృతి టౌన్‌షిప్‌లో..

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఫ్లాట్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు, కౌన్సిలర్‌ బి.హరిప్రసాదరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. యోగ ప్రాధాన్యతను వివరించారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..

ఘట్‌కేసర్‌ : పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొండాపూర్‌ యోగ చైతన్య సంస్థ అధ్యక్షుడు నరసింహారావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విప్పర్ల హనుమాన్‌ అందరితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఈశ్వర్‌, శ్రీనివాస్‌, సురేశ్‌, బాబురావు, దేవేందర్‌, రమేశ్‌, కౌన్సిలర్‌ మహేశ్‌, రవిశంకర్‌, రాధిక, నరేశ్‌, వీరేశం, చంద్రకాంత్‌, మాధవి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ కళాశాలలో..

మేడ్చల్‌ రూరల్‌ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌, నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల, కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్‌ కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.



జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌స్కూల్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



ఘట్‌కేసర్‌లో యోగా చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ



పల్లవి స్కూల్‌లో ..

ఎమ్మార్‌సెట్‌లో అంతర్జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్‌ రూరల్‌: మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్‌ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సును శుక్రవారం మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి , సైయంట్‌ లిమిటెడ్‌ వ్యవస్థాపక చైర్మన్‌ బీవీఆర్‌ మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. సాఫ్ట్‌ కంప్యూటింగ్‌ అండ్‌ సిగ్నల్‌ ప్రాసెసింగ్‌, ఇంటెలిజెంట్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌ అండ్‌ ఎనర్జీ సస్టైనబిలిటీ అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు నిపుణులు పాల్గొన్నారు. అధ్యాపకులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. కేఐఐటీ భువనేశ్వర్‌ ప్రొఫెసర్‌ సురేశ్‌చంద్ర, యూఎస్‌ఏ అడెల్ఫీ యూనివర్సిటీ డీన్‌ మురత్‌ ఎరోగుల్‌, మల్లారెడ్డి గ్రూప్స్‌ డైరెక్టర్‌ శాలినీరెడ్డి, మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌రావు, డీన్స్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐఈటీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, అసోసియేట్‌ కార్యదర్శి ప్రభాకర్‌, అభిషేక్‌ కుమార్‌ సదస్సును ప్రారంభించారు. అనంతరం ఐసీఈఏటీ–2024 ప్రొసిడింగ్స్‌ సీడీని ఆవిష్కరించారు. సదస్సులోని పరిశోధన పత్రాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డీన్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళాకు మంచి స్పందన

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోస్టాఫీస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాభవన్‌లో నిర్వహించిన మేళాకు మంచి స్పందన వచ్చిందని ఎఎస్‌పి వెంకన్న, పోస్ట్‌మాస్టర్‌ శ్యామల తెలిపారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తక్కువ మొత్తంతో ఎక్కువ లాభం పొందే పథకాలతో పాటు, ఇన్సూరెన్స్‌ పాలసీలు ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేళా ను ప్రతి వారం నిర్వహిస్తామని వారు తెలిపారు.

ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక

జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్‌

సాక్షి, మేడ్చల్‌ జిల్లా : యూపీఎస్సీ సివిల్‌ సర్వీసెస్‌ ఎగ్జామినేషన్‌ కోసం ఇంటిగ్రేటెడ్‌ ప్రిలిమ్స్‌ కమ్‌ మెయిన్స్‌ (పీసీఎం) 2025 బ్యాచ్‌లో ప్రవేశం నిమిత్తం జులై 21న జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌ కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్‌–మల్కాజిరి జిల్లాకు చెందిన వారై ఉండటంతో పాటు వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండకూడదన్నారు. ఏదేని జనరల్‌/ ప్రొఫెషనల్‌ డిగ్రీతో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఇ కేటగిరీలకు చెందిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. 2024–25 సంవత్సరానికి హైదరాబాద్‌ టీజీఎస్సీ స్టడీ సర్కిల్‌లో 10 నెలల వ్యవధికి ఉచిత రెసిడెన్షియల్‌ కోచింగ్‌ ప్రోగ్రాం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆన్లైన్‌ ద్వారా దరఖాస్తులను జులై 10వ తేదీ వరకు చేసుకోవాలని తెలిపారు.

ముదిరాజ్‌ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా రామస్వామి



రామస్వామికి నియామకపత్రాన్ని అందజేస్తున్న బండ ప్రకాష్‌

మేడ్చల్‌ : ముదిరాజ్‌ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన దుబ్బ రామస్వామి ముదిరాజ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ ముదిరాజ్‌, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బాలు ముదిరాజ్‌ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌ : యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మర్పల్లిగూడ గ్రామంలోలో మర్పల్లిగూడ ప్రీమియర్‌ లీగ్‌–4ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



మహేశ్‌ (ఫైల్‌)

ఘట్‌కేసర్‌ : కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండ ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. సీఐ సైదులు వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌ పట్టణం అంబేద్కర్‌ నగర్‌కు చెందిన గడ్డం మహేశ్‌ (40) కొంత కాలంగా భార్యతో విడిగా ఉంటున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండ తన షిఫ్ట్‌ కారులో బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు విఠల్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

తిరిగి వస్తానని చెప్పి..



లకావత్‌ శ్రీను (ఫైల్‌)

ఘట్‌కేసర్‌ : అన్న దగ్గర ఉంటున్న ఓ సోదరుడు అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. సీఐ సైదులు వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన లకావత్‌ శ్రీను(34)ను సంవత్సరం క్రితం అతడి భార్య వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఎన్‌ఎఫ్‌సీనగర్‌ దత్తాత్రేయనగర్‌లో నివసించే అతడి అన్న రాజు దగ్గర ఉంటున్నాడు. ఈ నెల 13న రాత్రి తిరిగి వస్తానని చెప్పి అన్న దగ్గర డబ్బులు తీసుకొని వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి తండ్రి పూల్‌సింగ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా



మేడ్చల్‌రూరల్‌ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆటో డ్రైవర్లకు పార్కింగ్‌ సౌకర్యం కల్పించాలని శుక్రవారం డ్రైవర్లు ధర్నాకు దిగారు. ఆటోల పార్కింగ్‌కు స్థలం లేదని మున్సిపల్‌ అధికారులను కోరగా.. కమిషనర్‌ నారాయణ చెరువు వద్ద పార్కింగ్‌ చేసుకోవాలని సూచించారని తెలిపారు. సిబ్బంది ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసిన గుడిసెను శుక్రవారం తొలగించడంతో ఆందోళన చేశారు. ఆటో డ్రైవర్ల నిరసనకు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్‌ హేమంత్‌రెడ్డి మద్దతు ప్రకటించారు.

అదుపు తప్పి డీసీఎం బోల్తా



శామీర్‌పేట్‌ : అదుపు తప్పి డీసీఎం బోల్తా పడిన ఘటన జినోమ్‌వ్యాలీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం జరిగింది. కొల్తూర్‌ నుంచి తుర్కపల్లి వైపు స్క్రాప్‌లోడ్‌తో వాహనం వెళ్తుంది. ఈ క్రమంలో జినోమ్‌వ్యాలీ భారత్‌ బయోటెక్‌ కంపెనీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో భారీగా ట్రాఫిక్‌ జామైంది. క్రేన్‌ సాయంతో పోలీసులు వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు.

డీసీపీగా కోటిరెడ్డి బాధ్యతల స్వీకరణ



మేడ్చల్‌ : మేడ్చల్‌ నూతన డీసీపీగా నంద్యాల కోటిరెడ్డి పేట్‌బషీరాబాద్‌ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్‌ ఎస్పీగా పని చేసిన ఆయన మేడ్చల్‌ డీసీపీగా బదిలీ అయ్యారు.